క్లుప్తంగా

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న జెడ్పీ సీఈఓ శ్రీధర్ రాజా

నరసన్నపేట: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని, దీనికి ప్రజలందరూ సహకరించాలని జెడ్పీ సీఈఓ శ్రీధర్ రాజా అన్నారు. మండలంలోని మడపాం గ్రామాన్ని సోమవారం ఆకస్మికంగా పరిశీలించారు. చెత్త సేకరణపై ఆరా తీశారు. ఎంపీడీఓ వెంకటేశ్వర ప్రసాద్, ఈఓపీఆర్డీ రేణుక ఆధ్వర్యంలో చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్తలను వేరు చేయాలని సూచించారు. స్వచ్ఛతపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలం వచ్చిందని, గ్రామాల్లో చెత్త సేకరణ చేయకపోతే వీధుల్లో చెత్త పేరుకుపోయి ప్రజలు వ్యాధుల బారీన పడే ప్రమాదం ఉందన్నారు. గ్రామస్తులకు చెత్త సేకరణపై కరపత్రాలు పంపిణీ చేశారు. వైద్య, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ సేవలకు గుర్తింపు



అవార్డులు అందుకుంటున్న రోటరీ క్లబ్ కార్యదర్శి రవిబాబు

ఆమదాలవలస: ఆమదాలవలస రోటరీ క్లబ్ సేవలకు గుర్తింపు లభించిందని రోటరీ క్లబ్ కార్యదర్శి జలుమూరు రవిబాబు సోమవారం తెలిపారు. రాజమహేంద్రవరంలోని చెరుకూరి వీర్రాజు–సుబ్బలక్ష్మి కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పలు అవార్డులు అందుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి ఉత్తమ కార్యదర్శిగా తనకు అవార్డు దక్కిందన్నారు. అనంతరం వివిధ రంగాల్లో సేవా కార్యక్రమాలకు 7 అవార్డులు దక్కాయన్నారు. పర్యావరణ పరిరక్షణ, రక్తదాన శిబిరాలు, కుట్టు శిక్షణ, ఒకేషనల్ విద్య, యోగా, ట్రీ ప్లాంటేషన్, వివిధ రకాల అవగాహన కార్యక్రమాలకు అవార్డులు వచ్చినట్లు తెలిపారు. రవిబాబుకు రొటేరియన్‌లు జె.కె.వెంకుబాబు, వి.టి.చౌదరి, నర్సింగరావు, పాత్రుని పాపారావు, జె.జె.మోహన్‌రావు, కార్యవర్గ సభ్యులు అభినందనలు తెలియజేశారు.

చొర్లంగిలో పల్లెనిద్ర



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్‌ఐ యాసిన్

హిరమండలం: మండలంలోని చొర్లంగి గ్రామంలో స్థానిక ఎస్‌ఐ మహ్మద్ యాసిన్ సోమవారం పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. పల్లెనిద్ర కార్యక్రమం ద్వారా ప్రజల్లోకి వెళ్లి వారి సమస్యలు తెలుసుకుంటామన్నారు. సమస్యలను తక్షణం పరిష్కరించేందుకే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లోనూ పల్లెనిద్ర నిర్వహిస్తామన్నారు.

స్టూడెంట్ బస్సును పునరుద్ధరించాలి

బూర్జ: మండల కేంద్రంలో జగన్నాథ స్వామి రథాన్ని శనివారం ఉదయం పాలకొండ నుంచి వచ్చిన స్టూడెంట్స్ బస్సు ఢీకొంది. రథం చక్రాలు విరిగి కొంత మేర నష్టం వాటిల్లిన విషయం తెలిసిందే. స్టూడెంట్స్ బస్సును నిలుపుదల చేశారు. మండల కేంద్రంతోపాటు, సుదూర ప్రాంతాల్లో ఉన్న పాఠశాలలకు వెళ్లి, వచ్చే విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. బస్సును పునరుద్ధరించాలని లంకాం, మామిడివలస, ఓ.వి.పేట తదితర గ్రామాలకు చెందిన విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

వరి వెద పద్ధతిలో..

సాగు బాగు..



వరి విత్తనాలు చల్లి పొలాన్ని చదును చేస్తున్న రైతు

- పెట్టుబడి వ్యయం తక్కువ
- కలుపు నివారణ సులువు
- యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు

జలుమూరు: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది.. రైతులు సాగుకు సమాయత్తమయ్యారు. ఇప్పటికే 50 శాతం వరకు వెదలు వేయడం జరిగింది. సాధారణంగా ఉడుపు పద్ధతిలో నాట్లు వేస్తే దిగుబడి, నాణ్యమైన పంట వస్తున్నప్పటికీ.. పెట్టుబడి ఖర్చులు అధికం కావడంతో రైతులు వెద పద్ధతిలో సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ, వరి సాగు ఆలస్యమైనప్పుడు వెద పద్ధతి వల్ల సమయం ఆదా అవుతుంది.

వెద పద్ధతితో ప్రయోజనాలు

- నారుమడి పెంపకం, నాట్లుకు అయ్యే ఖర్చు సుమారు ఎకరాకు రూ.8 వేల నుంచి రూ.పది వేలు మిగులుతుంది.
- చెరువులు, కాలవలు కింద సాగుచేసే వారు సకాలంలో వెదలు వేసుకోవచ్చు.
- విత్తన మోతాదు 40–50 శాతం తగ్గించుకోవచ్చు.
- పంట పడిపోకుండా 10 నుంచి 15 రోజులు ముందు కోత కోసుకోవచ్చు.
- తెగులు, పురుగుల బెడద తగ్గించుకోవచ్చు.
- కోత యంత్రాలతో సులువుగా పంట కోసుకోవచ్చు.

నరసన్నపేట నియోజకవర్గంలో వరి సాగు (ఎకరాలు) వివరాలు	
జలుమూరు	20,119
నరసన్నపేట	21,318
సారవకోట	18,454
పోలాకి	17,986
ఇందులో సుమారు 70 శాతం వెద, మిగిలిన 30 శాతంలో ఉభాలు వేయనున్నారు.	

విత్తన ఎంపిక ఇలా..

లోతట్టు ప్రాంతాల్లో ఎంటీయూ (1061) ఇంద్ర, ఎంటీయూ (1064) అమర, ఆర్‌జీఎల్ (2537) శ్రీకాకుళం సన్నాలు వేసుకోవాలి. కాలువ, చెరువుల కింద ఎంటీయూ 1121 (శ్రీధృతి), ఎంటీయూ 3291 (సోనామసూరి), బీపీటీ 5204 (సాంబమసూరి), ఎంటీయూ 1210 (సుజాత), ఎంటీయూ 1262 (మార్టేర్ సాంబ), ఎంటీయూ 7029 (స్వర్ణ) రకాల విత్తనాలు వేయాలి. ఆలస్యంగా విత్తే ప్రాంతాల్లో ఎంటీయూ 1156 (తరంగిణి), ఎంటీయూ 1153 (చంద్ర), ఎన్ఎల్ఆర్ 34449 విత్తనాలు వేసుకోవాలి.

సిఫార్సు మేరకు విత్తనాలు వేసుకోవాలి



వెద పద్ధతిలో వరిసాగు చేసేటప్పుడు వ్యవసాయశాఖ అధికారులు, శాస్త్రవేత్తలు సూచించిన విధంగా విత్తనాలు చల్లుకోవాలి. సన్న రకాలైతే ఎకరాకు 18 కేజీలు, ముతక రకాలైతే 20 నుంచి 22 కేజీలు వేసుకోవాలి. కాలిబాటలు తప్పనిసరిగా తీసుకోవాలి. నత్రజని తగ్గించుకోవాలి. సీడ్రిల్‌తో విత్తనాలు వేయడం వల్ల బహుళ ప్రయోజనాలు ఉంటాయి. విత్తన శుద్ధి ప్రధానం.

– కె.త్రినాథస్వామి, జిల్లా వ్యవసాయ అధికారి

నేల తయారీ..

వర్షాలు పడిన వెంటనే నేలను పలుమార్లు దున్ని మెత్తగా తయారు చేసుకోవాలి. ఆఖరి దుక్కిలో అధికారుల సిఫార్సు మేరకు బాస్వరం, పొటాష్ తదితర ఎరువులు వేసి నేలను కలియ దున్నాలి. నేలలో తేమ సరిగా లేకపోతే మొలక రాదు. తేమను చూసుకొని రోటావేటర్‌తో విత్తనాలు వేసుకోవడం మంచిది.

ఇలా చేస్తే అధిక దిగుబడులు..

- సరైన సమయంలో తగిన మోతాదులో కలుపు మందు పిచికారీ చేయాలి.
- కలుపు మందు పిచికారీ చేసే మయంలో పొలంలో నీరు పలుచుగా ఉండేలా చేసుకోవాలి.
- పిలక, చిరుపొట్ట దశలో ఎరువులు వేయాలి.
- పొటాష్‌ను విధిగా చిరుపొట్ట దశలో నత్రజనితో పాటు వేయాలి.
- కోత కోసే వారం రోజులు ముందు మాత్రమే పొలాన్ని ఎండగట్టాలి.

1,318 రకంపైనే ఆసక్తి ఎక్కువ

ఈ ఏడాది రైతులు చాలా మంది 1,318 రకం విత్తనాలు అధికంగా సాగుచేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. స్వర్ణకు ప్రత్యామ్నంతోపాటు 1,061 కంటే వారం రోజులు ఆలస్యంగా పంట పండుతుంది. ముంపు పొలాలతోపాటు వరి తరువాత మొక్కజొన్న వేసే రైతులు అధిక శాతం ఈ రకం విత్తనాలు వేస్తున్నారు.

విద్యా వ్యవస్థ నిర్వీర్యం



- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

హిరమండలం: విద్యా వ్యవస్థను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని వైఎస్సార్‌సీపీ క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి సోమవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. పేద విద్యార్థులకు ప్రభుత్వ విద్యను దూరం చేస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను విలీనం పేరుతో కుదించే చర్యలు చేపట్టడం అన్యాయమన్నారు. చేసిన పనులకే శంకుస్థాపనలు చేయడం కూటమి నాయకులకు అలవాటైన విద్య అని ఎద్దేవా చేశారు. మద్యం, ఇసుక, మట్టి మాఫియాలో టీడీపీ నేతలు కూరుకుపోయారని ఆరోపించారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైఎస్సార్‌సీపీదే విజయమన్నారు. మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. గత ప్రభుత్వంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక విద్యా సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలన్న లక్ష్యంతో నాడు–నేడు పథకం ద్వారా వాటి రూపురేఖలను మార్చిన విషయాన్ని గుర్తుచేశారు. మధ్యాహ్న భోజన పథకం, డిజిటల్ తరగతులు, జగనన్న విద్యా కిట్లు, అమ్మ ఒడి వంటివి అందించారన్నారు. ఉపాధ్యాయుల బదిలీల్లో పారదర్శకత పాటించారన్నారు. కూటమి ప్రభుత్వం విద్యా వ్యవస్థను నాశనం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏ అంశంలోనూ పారదర్శకత పాటించడం లేదన్నారు.

రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించండి

పోలాకి: రేషన్ డీలర్ల సమస్యలను ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులు తక్షణమే పరిష్కరించాలని పోలాకి రేషన్ డీలర్లు సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం డిమాండ్లను వెల్లడించారు. ఎంఎల్ఎస్ పాయింట్‌లో జరుగుతున్న లొసుగులు కట్టడిచేస్తే తప్ప.. తమకు న్యాయం జరగదని ఆవేదన వ్యక్తం చేశారు. కమిషన్ కూడా పంచధార రూపంలో కాకుండా నేరుగా బ్యాంక్ అకౌంట్లకు డబ్బులు జమ చేయాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న సీనియర్ సిటిజన్ డోర్ డెలివరీ కోసం లబ్ధిదారులను క్షేత్రస్థాయిలో సచివాలయ సిబ్బంది ద్వారా గుర్తించాలని కోరారు. ముఖ్యంగా ఎంఎల్ఎస్ పాయింట్‌లో ఇన్‌చార్జి బాధ్యతలు అటెండర్‌కు అప్పగించటం వలన తాము అనేక ఇబ్బందులు పడుతున్నామన్నారు.

చెరువు ఆక్రమణల పరిశీలన



చెరువులో ఉన్న ఆక్రమణలను పరిశీలిస్తున్న రెవెన్యూ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్

బూర్జ: మండలంలోని కేకే రాజపురం గ్రామ బద్ధి చెరువును రెవెన్యూ అధికారులు సోమవారం పరిశీలించారు. బుద్ధి చెరువులో ఆక్రమణలు తొలగించాలి అనే వార్త సాక్షిలో ఆదివారం ప్రచురితమైంది. దీనిపై రెవెన్యూ అధికారులు స్పందించారు. చెరువు గర్భంలో ఉన్న ఆక్రమణదారులు సుమారు 30 మందిని రెవెన్యూ సిబ్బంది గుర్తించారు. చెరువు గర్భంలో మట్టి వేసి విత్తనాలు జల్లితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. త్వరలోనే ఆక్రమణదారులకు నోటీసులు కూడా అందజేస్తామన్నారు. వీఆర్వో ఎం.ఉమామహేశ్వరావు, సర్వేయర్ ఎం.సంతోష్, వీఆర్ఏలు రామారావు, రామ్మూర్తి, మల్లేమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా..



ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ఫీజు బాక్స్

పాతపట్నం: మండలంలోని బురికిపేటలో రహదారి పక్కనే మూడు అడుగుల ఎత్తులో విద్యుత్ ఫీజు బాక్స్ ఉంది. దీనికి రక్షణ ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదకరంగా ఉంది. దీనికి సమీపంలోనే రచ్చబండ ఉండటంతో చిన్నారులు, విద్యార్థులు ఆటలు ఆడేందుకు ఇటువైపు వస్తుంటారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి ఫీజు బాక్స్‌ను ఎత్తులో ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

దేశ వ్యాప్త సమ్మెకు అంగన్‌వాడీల మద్దతు



సమ్మె నోటీసు అందజేస్తున్న అంగన్‌వాడీ యూనియన్ నాయకులు

ఆమదాలవలస: తమ సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు పంచాది లతాదేవి డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తూ.. కార్మిక వర్గంపై బానిసత్వాన్ని రుద్దటానికి నిరసనగా జూలై 9న దేశ వ్యాప్తంగా చేపడుతున్న సమ్మెలో తాము పాల్గొంటున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు సోమవారం ఆమదాలవలస ఐసీడీఎస్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ అమర్‌నాథ్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందన్నారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచాలన్నారు. కనీస వేతనం రూ.26 వేలు చేయాలని, గ్రాట్యూటీ జీఓ నంబర్ 8ను మార్పు చేయాలని కోరారు. పెన్షన్, పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలన్నారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ జీఓ విడుదల చేయాని డిమాండ్ చేశారు. వేసవి సెలవులను అమలు చేయాలని, కార్మిక కోడ్‌లను రద్దు చేయాలన్నారు. బాల సంజీవని యాప్‌లో మార్పులు చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు పి.భూలక్ష్మి, సునీత, భారతి, జ్యోతి, సత్యవతి, జానకి, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ..



ఫల్గుణరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ధర్మాన కృష్ణదాస్

సారవకోట: మండల కేంద్రానికి చెందిన మంద ఫల్గుణరావు ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ సోమవారం పరామర్శించారు. మృతుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలియజేశారు. పరామర్శించిన వారిలో పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, పార్టీ జిల్లా కార్యదర్శి యాళ్ల శ్యామసుందరరావు, వైస్ ఎంపీపీ గుణుపురం రామారావు, సర్పంచ్‌లు బాడాన కృష్ణారావు, కె.శంకరబాబు, పలువురు నాయకులు ఉన్నారు.

చింతువానిపేటలో..

నరసన్నపేట: మండలం చింతువానిపేటకు చెందిన రాడ ప్రగడాలమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె కుమారులు, కుటుంబ సభ్యులను మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ సోమవారం పరామర్శించారు. పరామర్శించి వారిలో పార్టీ నాయకులు సురంగి నర్సింగరావు, సతివాడ రామినాయుడు, రాడ నర్సునాయుడు, బుద్దల రాజశేఖర్, తోట భార్గవ్, తదితరులు ఉన్నారు.

మతలబుపేటలో..



అన్నారావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న చింతాడ రవికుమార్

సరుబుజ్జిలి: మండలంలోని మతలబుపేట గ్రామంలో సనపల నారాయణరావు ఇటీవల మృతి చెందారు. ఆయన కుమారుడు అన్నారావు కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ సోమవారం పరామర్శించారు. పరామర్శించిన వారిలో జెడ్పీటీసీ సభ్యుడు సురవరపు నాగేశ్వరరావు, పార్టీ నాయకులు పున్నపురెడ్డి తవిటినాయుడు, వీరఘట్టపు కృష్ణ, తదితరులు ఉన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

పాతపట్నం: ఈ నెల 2వ తేదీన పాతపట్నం సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ పనులు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు టెక్కలి విద్యుత్ శాఖ ఈఈ జి.శంకరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొత్త చంగుడి, దశరథపురం, బైరాగిపేట, తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

జగన్నాథుడికి జేజేలు



బూర్జ: వరాహ అవతారంలో జగన్నాథ స్వామి



పాతపట్నం: వరాహ అవతారంలో జగన్నాథుడు



హిరమండలం: నరసింహ అవతారంలో దర్శనమిస్తున్న జగన్నాథస్వామి



హిరమండలం: ఎల్.ఎన్.పేటలో నరసింహ అవతారంలో జగన్నాథుడు

బూర్జ: మండల కేంద్రంలో జగన్నాథ రథోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నారు. స్వామివారు గుండిచా మందిరంలో రోజుకో రూపంలో భక్తులకు దర్శనం ఇస్తున్నారు. నాల్గో రోజు సోమవారం వరాహ అవతారంలో పూజలు అందుకున్నారు. ప్రధాన అర్చకులు సూర్యనారాయణ ఆధ్వర్యంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

పాతపట్నంలో..

పాతపట్నం: స్థానిక బ్రహ్మణవీధిలోని జగన్నాథస్వామి సోమవారం వరాహ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకుడు చంద్రశేఖర్ పండా ప్రత్యేక, విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

హిరమండలం, ఎల్.ఎన్.పేటలో..

హిరమండలం: హిరమండలం, ఎల్.ఎన్.పేట గ్రామాల్లో జగన్నాథ స్వామి నరసింహ అవతారంలో దర్శనమిచ్చారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.















